
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!  సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

## సద్గురు పాదార్పిత సుమం



## గురుపూర్ణిమ సంచిక

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగ్‌హే  గురు స్వరూప చీ రసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్ధ నిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

--- శ్రీ బాబూజీ

## పత్రికలో పేజీలు


| | | | | |
|---|---|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి! | శ్రీ బాబూజీ | ............... | 2 |
| 2. | ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | ............... | 3 |
| 3. | ప్రబోధం ఈ నామధేయం | నంబూరి గీతశ్రీ | ............... | 7 |
| 4. | ప్రేమామృతం - గురుబంధుత్వం | జి.చంద్రవతి | ............... | 8 |
| 5. | సద్గురు అనుగ్రహమే నాకున్న సత్తువ | రామకృష్ణ | ............... | 10 |
| 6. | వంశాంకురం - బాబూజీ వరం | వి.లక్ష్మీదేవి | ............... | 11 |
| 7. | సాంప్రదాయమే వేరు - అనుగ్రహ సెలయేరు | శిరీష | ............... | 12 |
| 8. | సద్గురు సంకల్పం | గురుకృప | ............... | 14 |
| 9. | గురుచరణ యుగళమే రక్ష | సుస్మిత | ............... | 15 |
| 10. | అనుగ్రహ స్పందన | గురుకృప | ............... | 18 |


**గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి**
**leelas@guruji.org కి mail చేయగలరు.**
**ఇంటర్‌నెట్‌లో "గురుకృప" - Visit : www.guruji.org**



సంపుటి : 9
సంచిక : 3
త్రైమాసిక పత్రిక
జూలై 2006

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై !**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై !**

# గురుకృప

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
2-1-6
గాంధీచౌక్
తెనాలి - 01

☎
08644
227194 (O)

**ముద్రణ**
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం
ఫోన్స్: 2798072,
2740222

## ఉన్నమాట - అనుకున్నమాట

సమయగతి ఎరుగని సమ్మీంద్రుని సన్నిధిలో మరో సంవత్సరం గడిచిపోయింది. ఇదేమిటి – ఇప్పుడు సంవత్సరం అంటున్నారు, అని అనుకుంటున్నారా! మనం ఉన్న మార్గం గురుపథం, సద్గురుపథం, పూర్ణమైన గురుచంద్రుని అనుగ్రహం వర్షించే గొప్ప పర్వదినం గురుపూర్ణిమ. సాయి భక్తులకు పెద్ద పండుగ, సద్గురు పథగాములు అపారమైన సద్గురు అనుగ్రహాన్ని ఆస్వాదిస్తూ, గుర్తిస్తూ, మన గురువు పట్ల మనకున్న ప్రేమను చక్కగా వ్యక్తీకరించుకునేందుకు బాబా చెప్పి చేయిస్తున్న ఏకైక పర్వదినం గురుపూర్ణిమ. సాధకుడు తన ఆధ్యాత్మిక ప్రగతిని విశ్లేషించుకునేందుకు ఒక చక్కటి కూర్పు ఈ గురుపూర్ణిమ నుంచి రాబోయే గురుపూర్ణిమ. గురుపథంలో పయనించే ప్రతీ వ్యక్తి తప్పకుండా తప్పక విశ్లేషించుకోదగిన సందర్భం ఇది. ఎందుకు గురుపూర్ణిమ ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకుంది గురుపథంలో! ఏమిటి దీని ప్రాశస్త్యం. కొన్ని విషయాలను సద్గురు శ్రీ బాబూజీ మాటల్లోనే గమనిద్దాం.

పండుగలు పలు విధాలు. వాటిలో గ్రహ, ఆధ్యాత్మిక సంబంధమైనవి, ఋతు సంబంధమైనవి, రాజకీయ, మత, సామాజిక రంగాలలో పెద్ద సంస్కరణల మార్పుకు కారణభూతులైన యుగ పురుషులు, మహాత్ములు వంటి వారి జన్మదినోత్సవాలు – శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, బుద్ధ జయంతి మొ॥నవి. ఆధ్యాత్మికపరమైన రెండవ రకం పండుగలలో ఉపాసనా సంబంధమైనవి అంటే గాణపత్యులకు – గణపతే దైవం,





గణపతి పరబ్రహ్మ స్వరూపం – ఆయనే గమ్యం. ఇలా గణపతిని ఉపాసన చేసుకొనే వాళ్ళు చేసుకొనే పండుగ. అలా అన్ని సమాజాల వాళ్ళు చేసుకుంటూ పోగా ప్రతీ వాళ్ళకు పండుగలు వచ్చాయి. నిజానికి అన్నిరకాల వాళ్ళు చేసుకోవాల్సినవి కావు ఇవన్నీ! సాయిభక్తులకు బాబానే సద్గురువు, ఆయనే దైవం, ఆయనే మార్గం కనుక ఆయన చెప్పిన పండుగ ఏదైతే ఉందో అదొక్కటే సాయి భక్తులకు పండుగ. అందుకే సాయిభక్తులకు ప్రధానమైన పండుగ బాబా చెప్పినటువంటి "గురుపూర్ణిమ". అయితే ఇన్ని పండుగలు ఉండగా బాబా గురుపూర్ణిమనే చేసుకొమ్మని ఎందుకు చెప్పారు? అసలు చరిత్రలో ఏం జరిగింది? ఎప్పటిలానే గురుపూర్ణిమను శిరిడీలో ఉండే భక్తులెవరూ పట్టించుకోలేదు. బాబా దాదాకేల్కర్ అను భక్తుడ్ని పిలిచి కేకలేశారు! చేసుకోండి అని చెప్పడం కాదు – నాయనా! చేసుకోండి మంచిది అని మామూలుగా చెప్పడం కాదు – గురుపూర్ణిమ అని తెలియదా ఈ రోజున? – గురువుకు పూజ చేయాలని తెలియదా! అదుగో పో, పోయి ఆ స్తంభానికి పూజ చేసుకో అని చెప్పారు బాబా. ఎందుకు చెప్పారు బాబా? గురుపూర్ణిమ యొక్క ప్రాశస్త్యం ఏమిటి? అంటే ఆధ్యాత్మికంగా మనకు ఉపయోగపడే పండుగలు మన గమ్యానికి మనల్ని తొందరగా తీసుకుపోయే దానికి వీలుగా ఆ వైపు గాలి వీచే తెరచాపలాంటిదనుకుందాం!

గమ్యం వైపుకు పోవాలనుకునేవాడు గాలి వీస్తున్నవైపు తెరచాప ఎత్తుతాడు – ఆ ఫోర్స్‌కి ఇంకా బాగా వెళ్ళగలుగుతాడు. ఆ సమయంలో మన మనస్సనే తెరచాపను ఎత్తితే మన గమ్యం వైపున మనం ఇంకా ముందుకు వెళ్ళగలుగుతాం. మనసు మీద ప్రభావం ఎక్కువగా చంద్రుడి వల్ల ఉంటుంది. మానసిక గతిని అదుపు చేసేది చంద్రుడట. చంద్రుడి యొక్క ప్రభావం మనసుమీద పూర్తిగా ఉన్న రోజును – పూర్ణిమ అన్నారు – పూర్ణంగా ఉంటుంది కనుక. గురుపూర్ణిమ రోజున ఏమవుతుంది – గురువు యొక్క పూర్తి అనుగ్రహం – చల్లనైనటువంటి జ్ఞానమనే వెన్నెల మనమీద పూర్ణంగా వర్షిస్తూ ఉంటుంది. కనుక ఆ సమయంలో వ్యర్థ ఆలోచనల నుంచి మనం జాగరూకులం అవ్వాలి. గురుపూర్ణిమ ఘడియలలో మనం ఆలోచిద్దామన్నా – ఆలోచనలు రావు – జాగ్రత్తగా ఉంటే, వచ్చినా మనసు, ఆలోచన, ఆలోచనలలో లయం అయిపోతాయి. వీటిని మనం గురుపూర్ణిమ రోజు గమనించవచ్చు.

సరే! ఇక బాబా ఏం చెప్పారు. గురువును పూజ చేసుకొమ్మని చెపుతూ ఒక స్తంభాన్ని చూపారు. నన్ను పూజ చెయ్యి అని చెప్పలా! దానికి కారణం ఏమయ్యా అంటే ఏ గురువు





కూడా తనను గురువుగా భావించుకోడు. సరే చెప్పారు, ఎదురుగా ధుని ఉంది కదా, ధునినో, ఇంకోదాన్నో పూజించుకొమ్మని ఎందుకు చెప్పలా! స్తంభాన్నే ఎందుకు పూజించుకొమ్మన్నారు, అంటే – మొత్తం ఈ ఆధ్యాత్మికత అనేదానికి మూలస్తంభం సద్గురువు. ఈ స్తంభం మీదనే మొత్తం ఆధ్యాత్మిక సౌధం కట్టబడి ఉంది. అంటే ఆ కృప లేకపోతే, ఆ పట్టు లేకపోతే మొత్తం కూలిపోతుంది. కనుక మనం స్తంభాన్ని (గురువును) గుర్తించి పూజించాలి. గురువును పూజించాలంటే మనకు ముందు గురుతత్త్వం ఏమిటో తెలియాలి. ఆ విషయం తెలిస్తే గానీ సరిగా పూజ చేసుకోవడం తెలియదు. అది తెలిస్తేనే మనం గురుపూర్ణిమ యొక్క ఫలితాన్ని పూర్తిగా పొందగలం. బాబా కూడా అన్నారు "గురువును తెలుసుకో! ఎందుకొచ్చినట్లు, పిడకలేరుకోవడానికా" అని. ఎంత గొప్పగా ఉన్నదో ఆ మాట! కాబట్టి మొదట మనం గురువును తెలుసుకోవాలి. (గురుతత్త్వం అంటే ఏమిటో తెలుసుకోవాలి).

నాకు గురువు యొక్క అనుగ్రహం లేదు, గురువుయొక్క కృపలేదు అని మనం అనుకుంటూ వుంటాం! కానీ గురుకృప మాత్రం వర్షంలా ధారాపాతంగా ఎప్పుడూ ఉంది. బయట బాగా వర్షం వచ్చిందనుకోండి, మనం ఇంట్లో కూర్చొని ఉంటే తడవం. గురుకృప అనే వర్షం వర్షిస్తుంది, మనయొక్క అహంకారం, మమకారం, కోరికలలాంటి ఇంట్లోకి పోయి కూర్చుంటే మనం తడవం. కానీ, కిటికీలు, తలుపులు, తీసి పెట్టుకు కూర్చుంటే కొంచెం అయినా చల్లదనం వస్తుంది. అసలు తలుపులు మూసేసామనుకోండి బయట వర్షం వస్తున్నట్లు కూడా తెలియదు. మనం కనీసం కిటికీలు తీసిపెట్టుకొని ఉన్నాం, బయటకు మాత్రం పోవడం లేదు. గురువు అనేటటువంటి వారు కష్టాలనే వర్షాలనుండి కాపాడే (రక్షించే) గొడుగులాంటివారు అనుకుందాం. ఉదాహరణకి గొడుగు మనల్ని వర్షం నుంచి తడవకుండా కాపాడుతుంది. ఎట్లా కాపాడుతుంది. మూలనుండే గొడుగును తీసి దులిపి, దాన్ని తీసి సరిగా పెట్టుకుని జల్లు ఎటు నుంచి కురుస్తుందో దానికి వాటంగా గొడుగును పట్టుకోగలగాలి. వర్షం వచ్చేటపుడు గొడుగును చేతిలో పట్టుకున్నాం, చంకలో పెట్టుకున్నాం ఆ గొడుగు మనల్ని కాపాడుతుందా! లేదు మూలన పెట్టుకున్నాం, వర్షం రాగానే గొడుగు టింగ్ టింగ్‌మని నెత్తిమీదకొచ్చి మనల్ని కాపాడుతుందా! గొడుగును గొడుగులా ఉపయోగపెట్టుకుంటే అది గొడుగవుతుంది. లేకపోతే అది చేతికర్ర అవుతుంది లేకపోతే మూలనుండే ఒక పిచ్చికర్ర అవుతుంది.

చేతికర్ర లాంటి వాడు గురువు. మనం సరిగా నడవలేం, మనలను నడిపించేవాడు గురువు,





చేతికర్ర మూలనుంటే మనం నడవగలమా! చేతికర్రను పట్టుకొని, ఏ రకంగా పట్టుకొని అయితే మనం సరిగా నడవగలమో, ఆ రకంగా నడవడానికి మనం గురువును ఉపయోగపెట్టుకోవాలి! ఇది మనవైపు నుంచి మనం చేయవలసింది. కానీ జరిగేది మాత్రం ఏమిటంటే ఆయన కృపే మనల్ని అటు నడిపిస్తుంది. అది మామూలుగా ఉండే సంప్రదాయాల్లో సత్యం. మనం పట్టుకుంటే తప్పించి నడవలేం అనేది. కానీ బాబా విషయంలో మాత్రం అట్లా కాదు. ఎందుకంటే ఆయన మనమీద అసలు ఏమీ పెట్టలేదు! ఫలానాది చెయ్యి, ఇది చేస్తే నేను ఇది చేస్తా అని కూడా ఏమీ చెప్పలా!

ఆయన సంకల్పం లేకుండా సాయి భక్తులం కాలేం, శిరిడీకి రాలేం, ఆయన స్మరణ చెయ్యలేం. మనం చేయవలసినది ఏమిటి అని అంటే ఆయన యొక్క కృపను గుర్తించడం, గుర్తిస్తే మనకు ఆనందం, గుర్తించకపోతే ఆనందంగా మనం ఉండలేం. ఎవరో మనకు తెలియకుండా మన ఎకౌంట్‌లో లక్ష రూపాయలు వేసారు, మనకు తెలియదు, మన ఎకౌంట్‌లో లక్ష రూపాయలు ఉంది. మనకయితే ఆ విషయం తెలియదు, ఎవరో ఇది చేసి పోయినారు, వీడికేమో ఇంట్లో జరుగుబాటు కష్టంగా ఉంది. ఆరోజు ఆ క్షణం వరకు దరిద్రుడే, ఎకౌంట్‌లో డబ్బు ఉందని తెలుసుకున్నాడో ఆ క్షణం నుంచి లక్షాధికారి అయిపోయాడు. అంతకుముందు వాడేమన్నా భిక్షాధికారా! వాడి ఎకౌంట్‌లో ఉండే డబ్బు. అట్లాగే బాబా యొక్క కృప మనమీద వర్షిస్తుంది. రకరకాల పరిస్థితుల రూపంలో, రకరకాల సంఘటనల రూపంలో మనకు చూపిస్తూనే ఉన్నారు. కానీ మనం దాన్ని గుర్తించడంలా! గుర్తిస్తే మన మనసు కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. ఇంకా ఇంకా ప్రోత్సాహకరంగా మనం ముందుకు పోగలం. మనం చేయవలసినదంతా ఏమిటంటే మన జీవితంలో జరిగే వివిధ సంఘటనలు ఎట్లా ఏ కూర్పుతో వస్తున్నాయి, దీంట్లో సాయికృప ఎట్లా వ్యక్తమవుతోంది, అనేది మనం గుర్తించడమే! జరిగే సంఘటనలు సాయికృప ద్వారానే అని ఎట్లా తెలుసుకోవడం. కార్యకారణంగా జరిగే సంఘటనలను మనం బాబా కృప అనుకుంటున్నామేమో! మనల్ని మనం మోసం చేసుకుంటున్నామేమో! అని కూడా అన్పించవచ్చు కొంతమందికి, అలా సద్గురు అనుగ్రహాన్ని గుర్తింపులో ఉంచుకొని, కృతజ్ఞతతో మనం చేయవలసిన పని సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే! వ్యర్థ సంభాషణలలో, పరనిందా ప్రసంగాలలో మనం పాల్గొనకుండా ఉండడమే! శిరిడీ వచ్చి పరనిందా ప్రసంగాలలో పాల్గొనే వ్యక్తిని బాబా పంది అశుద్ధాన్ని తినటంతో





పోల్చిన తీరు చరిత్రలో చూసాం! కాళిదాసు కూడా ఇట్లాంటి ఉపమానం చెప్పలేదంటారు గురుదేవులు. అట్లా ఎదుటివారి మానసిక మాలిన్యాన్ని మనం శారీరకంగా శుభ్రం చేయవద్దంటారు గురుదేవులు. "మనకు గానీ, ఎదుటివారికి గానీ, ఆ స్థలంలో లేని మూడవ వారికి గాని ఉపయోగం లేని మాటలను మాట్లాడకుండా ఉండడం, ఉపయోగం అంటే నేను అది ఆధ్యాత్మికమైనదని చెప్పడంలా ప్రాపంచికమైనదైనా సరే, మనకన్నా, ఎదుటివానికన్నా, అక్కడలేని మూడోవ్యక్తి కన్నా ఉపయోగం ఉండాలా!" – కనుక **ఈరోజు నుంచి పూర్ణమైన గురుచంద్రుని వెలుగులో కూర్చొందాం! కిరసనాయిలు బుడ్డి దీపాలక్రింద కూర్చోవద్దు.**

**పిడకలేరద్దు - గురువును గుర్తుంచుకో...**

## ప్రబోధం ఈ నామధేయం

హైందవధర్మం ఆచార్యునికి పెద్ద పీటవేసి గౌరవించడమనే ఒక సదలవాటును చక్కగా నేర్పింది. ఆ కోవలోనే భూత, భవిష్యత్, వర్తమానాలు తెలిసిన ఆచార్యులు చంటిపిల్లలకు నామకరణం చేసేవారు. చరిత్రలో బాబా కూడా కొంతమందికి అలాగే పేర్లు పెట్టడం మనకు విదితమే. పరిమితమైన సంప్రదాయాలకు, ఆచారాలకు – అపరిమితమైన సద్గురు లీలా ప్రబోధానికి ఉన్న తేడా ఏమంటే, సద్గురువు చేసే ప్రతీ చర్య ఒక ప్రబోధాన్ని మనకందిస్తూ ఉంటుంది. ఆయన సన్నిధిలోనే తన భక్తులను ఉంచుకుంటూ, పెద్దలను గౌరవించడమెలాగో నేర్పుతూ, సదా కృష్ణుడ్నే స్మరించే కృష్ణ భక్తురాలికి ఒక తెలియని విషయాన్ని తెల్పుతూ, ఊహకందని "వ్యూహ" అనే నామకరణం – సుమధురం. ఆలోచిద్దాం – ఇలా వారు పెట్టే ప్రతీ పేరు సద్గురు ప్రబోధమనే సెలయేరు. ఆ పాప జీవిత పర్యంతం – పాప తండ్రి, సద్గురువనే తండ్రిని మరిచే అవకాశంలేదు, జన్మనిచ్చిన తల్లి మరపులోకి వచ్చే పరిస్థితిరాదు. ఆహా ! ఇది కదా! సద్గురు లీలా ప్రబోధం.

నాకు బాబా, గురువుగారి దయవల్ల 16-02-1997లో ఒక పాప పుట్టింది. పాపకి పేరు పెట్టమని గురువుగారిని అడిగాము. గురువుగారు మేలో వారి పెళ్ళిరోజున షిరిడి తీసుకుని రండి అక్కడ పేరు పెడదాము అన్నారు. మేము అలానే పాపని తీసుకుని వెళ్ళాము.

గురువుగారు మే 27న ఉదయం అందరికీ దర్శనం ఇస్తున్నారు. నేను పాపని వారి చేతులలో ఉంచాను. వారు పాపని ఎంతో ఆప్యాయంగా చూస్తూ 'వ్యూహ' అని పిలువమ్మా అన్నారు.







మేమందరము ఏదో బాబా పరమైన పేరును పెడతారు అని అనుకున్నాము. ఇదేమి పేరు అని అనుకున్నాము. మాకు దాని అర్థం అంతగా తెలియలేదు.

రాత్రికి మమ్మల్నందర్నీ సత్సంగానికి పిలిచారు. ఏంటి పాప పేరు నచ్చిందా? అన్నారు గురువుగారు. దాని అర్థం మీకు తెలుసా? అని అడిగారు. మాకు తెలియదని చెప్పాము. మా అత్తగార్ని కూడా అడిగారు. ఆవిడ కూడా తెలియదని చెప్పారు. అపుడు గురువుగారు మీకూ తెలియదా? అది మీ కృష్ణుడి పేరే. కృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు వీరు నలుగురు యాదవవంశ మూలకారకులు. వీరిని యాదవ వంశ వృక్షమనీ, 'వ్యూహము' అని అంటారని చెప్పారు. అప్పుడు గాని మాకు ఆ పేరులో ఉన్న మర్మమేమిటో అర్థం కాలేదు.

మా అత్తయ్యగారు గౌడీయ మఠ సాంప్రదాయాన్ని ఎంతో నిష్ఠగా పాటిస్తారు వారికి కృష్ణుడంటే ఎంతో ఇష్టం. వారికి భాగవతం గురించి బాగా తెలుసు. కాని గురువుగారు చెప్పేంత వరకు మా పాపాయికి తనకు ఇష్టమైన కృష్ణుడి పేరే పెట్టారన్న విషయం ఆవిడకి కూడా తెలియ లేదు. కృష్ణుడినే సదా పూజించే వారికి వారి మనవరాలిని చూడగానే కృష్ణతత్త్వం ఎరుకలోకి వచ్చే తీరున... గురూజీ చేసిన నామకరణ ప్రబోధం.

**నంబూరి గీతశ్రీ అన్నపూర్ణ**

## ప్రేమామృతం - గురుబంధుత్వం

షిరిడి నుండి తిరుగు ప్రయాణమవ్వాల్సిన ఒక గురుబంధువుకు, ఇంకో గురుబంధువు ఫోన్ చేసి- "ఏమయ్యా శుక్రవారమే బయలు దేరతానన్నావు షిరిడి నుంచి, ఈ రోజు మంగళవారం ఇంకా బయల్దేరలేదు ఏమిటి?" అని అడిగాడు. "ఏమిటో తెలియట్లేదు, నాకు బయల్దేరాలంటే ఇబ్బందిగా ఉంది. బాబా ఇక్కడి గాలిలో కూడా 'ప్రేమ'ను కలిపారనిపిస్తోంది". ఆ మాటలు వినగానే కొంచెం ఆశ్చర్యపోయాము. గాలిలో ప్రేమను కలిపిన మాటలో అతిశయోక్తి లేదేమో! అనిపించింది. అది నిజం కాకపోతే నాడు బాబా సన్నిధిలో ఎక్కడి పూనా,నాగ్‌పూర్, అహ్మదాబాద్,.....ఎన్ని ప్రాంతాలు, ఎందరు వ్యక్తులు, వాళ్ళలో ఒకరి పట్ల ఒకరికి ఉన్న ప్రేమాభిమానాలు, వాత్సల్యం ఇదంతా బాబా పంచిన ప్రేమ, పెంచిన వాత్సల్యం. నేడు బాబూజీ సన్నిధానంలో ఎక్కడెక్కడి వ్యక్తులో 'సాయిపథం' అనే సొంత ఇంట్లో ఉండటం, సాటివారి కష్టాలకు స్పందిస్తున్న తీరు ఆ 'ప్రేమ మూర్తి' మనకందించిన ప్రేమామృతపు





చిరుచినుకులు మాత్రమే! సహస్రబుద్దే నూల్కర్‌కు సేవ చేసిన సంఘటన మరల జరిగిందని, పేర్లు మాత్రమే మారాయని 'గురుకృప' ఈ అనుభవాన్ని సవినయంగా అందిస్తోంది.

నా పేరు చంద్రవతి, మాది నెల్లూరు. నా ఆరోగ్యము, ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా, బాబా గురుదేవుల అనుగ్రహంతో ఎక్కువ సమయాన్ని వారి స్మరణలో గడుపుతున్నాను. తరచుగా శిరిడీ వస్తూ, ప్రతి గురుపౌర్ణమికి తప్పని సరిగా గురుదేవుల దర్శనం చేసుకుంటున్నాను. ఒక గురుబంధువు ప్రోద్భలంతో నేను సత్సంగానికి వెళుతూ, వారి ప్రోత్సాహంతో మొదటిసారి కొండయ్యగారితో కలిసి శిరిడీ చేరాను. శిరిడీ చేరేసరికే నేను కాలు నొప్పితో బాధపడుతున్నాను. పదిహేను రోజులు శిరిడీలో ఉండి ప్రదక్షిణలు, మందిరానికి వెళ్ళడం ఇలా కాలునొప్పి మరింత ఇబ్బంది పెట్టింది. ఈ విషయాన్ని నేను గురువుగారికి విన్నవించకముందే వారు ఈ ఇబ్బందిని తొలగించారు. ఇదే సర్వకాల సర్వావస్థలయందు నా బిడ్డల బాధ్యత నేను వహిస్తానని బాబా ఇచ్చిన అభయానికి నిరూపణ.

నెల్లూరులో ఉన్నన్ని రోజులు నా వయసుకు తగ్గ శ్రమ చేసుకుంటూ, క్రమం తప్పకుండా సత్సంగాలకు వెళుతుంటాను. నా ఆర్థిక పరిస్థితుల కనుకూలంగా ఖర్చును, ఏదో రూపేణ ఆదాయాన్ని అందిస్తూ గత ఒక సంవత్సరం ఎనిమిది నెలలుగా నన్ను శిరిడీలో ఉంచిన గురువుగారి కరుణను ఎంతని వర్ణించను. గత సంవత్సరం దసరా ఉత్సవాలకు గురువుగారు శిరిడీ వచ్చినపుడు నేను రోజూ చక్కగా దర్శనం చేసుకుంటూ గడుపుతున్నాను, ఇకవారు తిరువణ్ణామలై బయలుదేరిన రోజు నాకు ఎపెండిసైటిస్ (24 గం॥ల కడుపునొప్పి) వచ్చినది. అప్పుడు మా ఇంటి యజమానురాలు (మరాఠీ వారు) తెలుసుకొని రాజుగారికి తెలిపారు. వెంటనే శిరిడీలోని జ్యోతి హాస్పటల్‌లో చేర్చారట, నాకు స్పృహలేదు. శిరిడీకి 40కి॥మీ॥ దూరంలో ఉన్న 'లోని' అనే ఊళ్ళో వున్న పెద్ద ఆసుపత్రిలో నన్ను చేర్చారు, శిరిడీలో ఉన్న గురుబంధువులంతా నన్ను చూసేందుకు 'లోని' వచ్చారు. జ్యోతి హాస్పటల్‌కి వచ్చిన రాజుగారు, కిషోర్‌గారు, రవిగారు, కృష్ణవేణి గారు, లక్ష్మీగారు...ఇంకా ఇతర గురుబంధువుల సహకారంతో మా ఇంటి యజమాని మందాకిని గారు-బిడ్డలు, నర్సులు, సొంతమనుషులు కూడా చేయలేని పనులన్నీ చేస్తూ నన్ను మళ్ళీ మామూలు మనిషిగా చేసారు. నేను కోలుకోవడానికి సుమారు నెలరోజులు పట్టింది. నెలరోజుల పాటు గురుబంధువులు నావెంటే ఉన్నారు. నెల్లూరు నుండి మా అన్నయ్య, తమ్ముడు వచ్చి కొద్దిగా తగ్గిన తర్వాత నెల్లూరు తీసుకువెళ్ళారు. కాలం





గడిచింది. 2005 గురుపూర్ణిమ రానేవచ్చింది. ఇంట్లో అన్నయ్య వాళ్ళు భయపడుతున్నా, గురువుగారిపై భారం వేసి గురుపూర్ణిమకు ఎప్పటిలాగే వచ్చి వారి దర్శనం చేసుకున్నాను.

నాకు శిరిడీలో ఇబ్బంది అయినపుడు సేవ చేసిన వారెవ్వరూ నా రక్త సంబంధీకులు కారు, వారితో ఉన్న బంధం 'గురుబంధుత్వం', ఈ ప్రేమ బంధానికి ఏ బంధమూ సాటిరాదు. ఊరుకాని ఊరులో, నా భాషకూడా తెలియని మందాకిని గారితో కూడా బాబా చేయించిన సేవ, బాబా అనుగ్రహానికి పరాకాష్ఠ. నా విన్నపాన్ని గురుకృప ద్వారా గురుదేవులకు తెలుపుకోవాలని ఉంది. "నాకు శిరిడీని స్థిర నివాసంగా చేసి, చివరి రోజులు శిరిడీలోనే ముగిసి, నా అస్థికలు ఆ నేలలో కలవాలని నా ఆకాంక్ష."


**-జి.చంద్రవతి**, శిరిడీ.

## సద్గురు అనుగ్రహమే నాకున్న సత్తువ

"సద్గురు కల్పతరువు మూల కూర్చుండి యుండినాను కోరుకున్న ఫలమేదైన చేరి కోసుకొందునందు" ఇంకేం! సద్గురువనే కల్పవృక్షం క్రింద కూర్చొనటమే అసలు అర్హత, వారి చెంత కూర్చొంటే ఆలోచించడం అనవసరమే! ఒక సాధువు ఎప్పుడు చూసినా ఏదో ఒక అలౌకికమైన ఆనందంలో ఉంటున్నాడుట! ఇదంతా ఎట్లా సాధ్యమా అని ఒకతను రోజూ గమనిస్తే, అతను ఒక పుస్తకాన్ని తరచుగా తెరిచి చూసుకుంటూ ఉండటాన్ని గమనించాడు. చివరకు ఆ సాధువు చెంతకెళ్ళి, ఏమయ్యా! ఏమా పుస్తకం అని అడిగి చూస్తే, ప్రతీ పేజీలోనూ పెద్ద పెద్ద అక్షరాలతో తన గురువు నామం రాసిపెట్టి ఉంది. ఆనందానికి, అవసరానికి, ఆలోచనకూ, ఆరోగ్యానికి ఆలంబన సద్గురు నామామృత పానమే! అది ఉంటే ఇక కావాల్సిందేముంది.

గురుకృప ద్వారా గురువుగారిని మనందరం మరొక్కసారి స్మరించుకుందామనే ప్రయత్నం. నా పేరు రామకృష్ణ, హైదరాబాద్‌లో ఉంటున్నాను. నేను ఒక బ్యాంక్ ఉద్యోగిని. శ్రీ బాబూజీ అనుగ్రహాశీస్సులతో రాబోయే కాలంలో ఉద్యోగానికి కెనడా వెళ్దామని ప్రయత్నం చేస్తున్నాను. కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు వెళ్ళాలంటే కనీసం 2సం॥ల ప్రాసెస్ (కార్యక్రమం). కెనడా వెళ్ళడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్న కన్సల్టెంట్‌కు నేను మొదటి వాయిదాగా రూ॥30,000/-లు కట్టవలసి ఉంది. నాకు జీతం తప్ప వేరే సంపాదన లేదు. కనుక ఎలా





కట్టాలా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో బ్యాంక్ ప్రతీ సంవత్సరం ఇచ్చే బోనస్ ఇచ్చింది. గత రెండు సంవత్సరాల నుంచి ఈ బోనస్ 12,000/–రూ॥లు ఇచ్చేవారు. అయితే ఈసారి గురుదేవులు నా అవవసరానికనుగుణంగా అనుగ్రహించి 22,000/–రూ॥లు బోనస్‌గా, 2,200/–రూ॥లు ఇంక్రిమెంట్‌గా ఇప్పించారు. ఇంతటితో అయిపోయిందనుకునేరు! కన్సల్టెంట్‌తో 5,000/–రూ॥లు డిస్కౌంట్ ఇప్పించి 25,000/–రూ॥లు నా చేత కట్టించారు. ఏమి ఏర్పాటు, ఎంత చక్కగా ప్లాన్ చేశారు నా కోసం అనిపించింది. అంతేకాదు, ఎప్పుడు, ఎవరికి ఏది అవసరమో వారికి అది ఏర్పాటు చేయడం జరుగుతుందని అవగతమయింది.

నా ఇంకో అనుభవం మీతో! మే నెల మొదటి వారంలో నా ఆరోగ్యం బాగాలేదు. చాలా బలహీనంగా తయారయ్యాను. కానీ బ్యాంక్‌లో నా అవసరం ఎంతైనా ఉంది. మూడు రోజులు సెలవు తర్వాత బ్యాంక్‌కు వెళ్ళి నాపెండింగ్ పనులు నేను చేసుకోలేకపోయాను. సరే! ఇక ఏం చేయాలో తోచక నరేంద్రన్నకు మెయిల్ పెట్టాను, నా పరిస్థితిని వివరించి గురుదేవుల దీవెనలు కావాలని తెలుపమని! తర్వాత రోజు తెల్లవారేసరికి మూడు, నాలుగు రోజులు కనీసం ఉంటుందనుకున్న బలహీనత, నిస్సత్తువ ఇక లేవు.

గురుదేవుల అనుగ్రహంతో ఈ మధ్య మా ఇంట్లో సత్సంగాన్ని నిర్వహించుకుంటున్నాం.

**– రామకృష్ణ,** హైదరాబాద్.

## వంశాంకురం - బాబూజీ వరం

ఇహములోనే పరము చూపెడి వారే సద్గురువు – అన్న నానుడికి భాష్యం శ్రీ బాబూజీ. భక్తులు కోరినవన్నీ నాడు బాబా ఇస్తే – ఆ బాధ్యత నేడు శ్రీ బాబూజీ స్వీకరించారు. “నీకున్నది కుమార్తెలే గదా! కుమార్తెలు చింతకాయల వంటి వాళ్ళు; కుమారుడో– మామిడి పండు వంటివాడు.” అంటూ మహల్సాపతిని రాత్రుళ్లు ఇంటి వద్దనే నిదురించమని బాబా ఆదేశించి, కుమారుడిని ఇచ్చి ఆ వంశాన్ని నిలబెట్టిన వైనాన్ని చరిత్రలో చూసాం! మగబిడ్డే కావాలని కోరుకున్న సాఠే కోర్కెను తీర్చి మగబిడ్డను ప్రసాదించిన బాబా కరుణకు శిరస్సువంచి ప్రణామాలర్పించాం.





అయితే అన్నాచించినీకర్‌కు పుత్రుడినడిగిన భక్తునితో – సాయి "తానివ్వదలచినది వేరే ఉందని చెప్పి", చావడి రూపంలో తరగిపోని ప్రతిష్ఠను ఇచ్చిన వైనాన్ని కూడా అవలోకించుకుందాం. వంశాభివృద్ధికి పుత్రులే హేతువులు కాదు.. సద్గురు చెంతన ఏదైనా శాశ్వతమే! "మానవుడిచ్చింది నిలవదు, సద్గురువు ఇచ్చింది పోదు!" అదే రీతిన శ్రీ బాబూజీ ఈ గురుబంధువుకు వంశాంకురాన్నిచ్చిన వైనం చూద్దాం.

నాపేరు లక్ష్మీదేవి, మాది గుంటూరు. నాకు 1999వ సం॥లో వివాహం అయినది. అప్పటికే నేను గురువుగారి చెంతకు చేరాను, నాకు 2000 సం॥లో పాప పుట్టినది. మా కుటుంబంలో ఇప్పటి వరకు వివాహం అయిన వారందరికి అమ్మాయిలే. మొత్తం ఎనిమిది మంది అమ్మాయిలు. నాకు రెండవసారి గర్భం వచ్చింది. మా వాళ్ళందరికి ఎంతో భయం ఉండేది, ఎందుకంటే మా తరంలో వారసులు లేరు అని. ఇటువంటి సమయంలో నేను గురువుగారిని ప్రార్థించుకున్నాను. నాకు మగపిల్లవాడు పుట్టాలి అని. గురువుగారిని రోజూ ప్రార్థించేదానిని నా కోరిక నెరవేర్చమని. మావారు కూడా ఒక్కరే కావటంతో మా ఇంట్లో వారు కూడా ఎంతో ఆశగా ఎదురు చూశారు. నా కోరిక ఫలించింది. గురువుగారి అనుగ్రహంతో నాకు 13–11–2004 లో బాబు పుట్టాడు. నాకు చెప్పలేని ఆనందం కలిగింది. నేనే కాదు మావారు, మా కుటుంబంలో అందరూ ఎంతో ఆనందం పొందారు. అది ఎంత ఆనందం అంటే చెప్పలేనిది. ఇది కేవలం గురువుగారి కృప వల్లనే అని నా విశ్వాసం. ఇటువంటి ఎన్నో సంఘటనలు నా జీవితంలో గురువుగారి అనుగ్రహంతో జరిగాయి.


నా బిడ్డను వారి వద్దకు తీసుకువెళ్ళి ఆశీస్సులు తీసుకోవాలని నాకోరిక. వారి దర్శనానికై వేచిచూస్తూ...

- **వి.లక్ష్మీదేవి**, గుంటూరు.

## సాంప్రదాయమే వేరు - అనుగ్రహ సెలయేరు

'సౌఖ్యం చిక్కాక నాబిడ్డలు నన్ను ఆశ్రయిస్తారు' అన్న బాబా వాక్కుకు అనుభవరూపం నేటి సాయిపథం యువత. స్థిరత్వం గురించి వారికి ఏ చింత లేకున్నా, శ్రీ బాబూజీ మాత్రం ప్రతీ బిడ్డను సమున్నతంగా తీర్చిదిద్దడం – ఈ బిడ్డలపై సద్గురు 'మాయి'కున్న బాధ్యతకు తార్కాణం. బ్రహ్మాస్త్రమే అమ్ముల పొదిలో ఉంటే భయపడతాడా సైనికుడు. అలాగే బాబూజీ సన్నిధే అన్ని ఏర్పాట్లకు, అన్ని పరిస్థితుల నెదుర్కొనేందుకు మనల్ని సిద్ధం చేస్తుంది. 'కాలాతీతాన్ని' కాలుడెప్పుడో తీసుకెళ్ళిపోయాడు బాబూజీ నుండి. ఎప్పుడు ఎవరికి ఏది అవసరమో అప్పుడు





ఆ ఏర్పాటు వారి సన్నిధిలో జరిగిపోతుంది. వారి 'సాంప్రదాయమే వేరు' – అది 'అపారమైన అనుగ్రహసెలయేరు'!

నా పేరు శిరీష. నేను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ట్రిచిలో ఎమ్.టెక్ చేస్తున్నాను. నాల్గవ సెమిస్టర్ లో భాగంగా నేను ప్రాజెక్టు వర్క్ చేయవలసిన అవసరం ఉంది. నా మూడవ సెమిస్టర్ పరీక్షలు అయిపోయాక ప్రయత్నాలు ఆరంభించాల్సిఉంది. నా స్నేహితులంతా వేరే వేరే ఊళ్ళలో ప్రాజెక్టు కోసం ప్రయత్నిస్తున్నారు. మా ప్రొఫెసర్లు కూడా మమ్మల్ని బయటకు వెళ్ళి ప్రాజెక్టు చేయమని చెప్పారు, అంతేకాక క్యాంపస్ ఇంటర్వ్యూ లలో నాకు బాబా, గురుదేవుల ఆశీస్సులతో హెచ్.సి.ఎల్.టెక్నాలజీస్‌లో జాబ్ వచ్చింది. కనుక మాకు ఉద్యోగం వచ్చిన కంపెనీలలోనే ప్రాజెక్టు కోసం ప్రయత్నం చేయమని మా ప్రొఫెసర్లు చెప్పారు. నేను హెచ్.సి.ఎల్.కు ఫోన్ చేసి హెచ్.ఆర్. మేనేజర్‌ను ప్రాజెక్టు కోసం అడిగితే సరైన స్పందన రాలేదు, నాకు కొంచెం బాధనిపించింది. మా ఫ్రెండ్స్ కొంతమందికి వాళ్ళు సెలెక్ట్ అయిన కంపెనీలలోను, కొంతమంది వాళ్ళ స్నేహితుల ద్వారా ప్రాజెక్టులు సంపాదించారు. నా విభాగంలో పనిచేసే ఒక్క వ్యక్తి కూడా నాకు తెలియరని నాకు అర్థమైంది. ఏమీ పాలుపోక గురుదేవుల ముందు నిల్చొని ప్రాజెక్టునిప్పించమని వేడుకున్నాను, ఇదంతా నా మూడవ సెమిస్టర్ సెలవులలో జరిగిన విషయం. నాకెవ్వరూ తెలియదు, నేను ఏ ప్రయత్నము చేయలేదు, అయితే నాకు మాత్రం ప్రాజెక్టు అవసరం.

ఇంతలో మూడవ సెమిస్టర్ సెలవులు అయిపోయి, నేను నాల్గవ సెమిస్టర్ కోసం ట్రిచి వెళ్ళిపోయాను. వారం రోజులు గడిచిపోయాయి. ఒకరోజు నాకు ఫోన్ వచ్చింది, ఎవరా అని చూస్తే, SYNOPSYS అనే కంపెనీ IP గ్రూప్‌కు మేనేజర్‌ని అంటూ ఒకతను పరిచయం చేసుకుని, మీరు ప్రాజెక్టు కోసం ప్రయత్నం చేస్తున్నారట గదా! మా కంపెనీలో చేస్తారా అని అడిగారు. నాకు ఆశ్చర్యమనిపించింది, జరుగుతున్నదంతా నమ్మలేకపోయాను. నేను బయోడేటాను ఇవ్వకుండా, నేను అడగకుండా నాకు అవకాశం రావడం కేవలం గురుదేవుల సంకల్పమే! అనుగ్రహమంటే ఆకాశం నుంచి ఊడి పడదన్నట్లు, నా స్నేహితులలో ఒకరు ఆ కంపెనీ వాళ్ళకు నా ఫోన్ నెంబర్ ఇచ్చారని తెలిసింది. నాకు టెలిఫోన్‌లో ఇంటర్వ్యూ జరగడం, వెంటనే బెంగుళూర్ వెళ్ళి ప్రాజెక్టు వర్క్ ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. నేను







కేవలం నాకు ప్రాజెక్టు వర్క్ బయట కంపెనీలో ఇప్పించమని కోరాను గురువుగారిని, కానీ వారి ఎంపిక ఎప్పుడూ ఉత్తమమే కదా! మంచి కంపెనీలో మంచి ప్రాజెక్టు కూడా ఇచ్చిన వారి పాదాల చెంత సుమమై

-**శిరీష,** బెంగుళూర్

## సద్గురు సంకల్పం

క్షమించమని వేడుకుంటున్నాం సద్గురుదేవులు శ్రీ బాబూజీని. విజయవాడ గురుబంధువు శబరీనాధ్‌ను బాబా తన చెంతకు చేర్చుకున్న విషయం మనకు విదితమే. సద్గురుమూర్తి అతనికి ఇచ్చిన పాత్రను చక్కగా నిర్వర్తించి, వారి చెంతకు చేరాడు శబరి.

అతి పిన్న వయసులోనే బాబా చెంతకు చేరిన శబరి సాయిపథం కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొనడం, గురుదేవుల పట్ల అతనికున్న విశ్వాసం, గురుదేవుల నుంచి అతను నేర్చుకున్న నడవడి, ఆచరణ మరిచిపోలేనివి. ఈ మధ్యకాలంలో అతని పుస్తకాలలో దొరికిన 'నిర్మల్ హృదయ్' చందా రశీదులు అతనిలో గురుదేవులు నాటిన దాతృత్వ బీజాలకు సంకేతం.

శోకం యొక్క స్థితి – సద్గురువు పట్ల మనిషికున్న విశ్వాసాన్ని తెలియపరుస్తుంది. గురుదేవుల పట్ల శబరి తల్లిదండ్రులకున్న విశ్వాసం వారిని శోకంలోనూ మరింతగా గురుదేవుల చెంతకు చేర్చుతోంది. శబరి దివంగతుడైన విషయం శబరి వాళ్ళ అమ్మగారికి ఎవరూ చెప్పకపోవడం, బాబానే ఆమెకు దర్శనమిచ్చి – "అమ్మా, నేను నీ బిడ్డను తీసుకువెళ్ళానని" బాబా చెప్పడం సద్గురుకృపకు నిదర్శనం. కొందరు గురుబంధువులకు బాబా స్వప్న దర్శనమిచ్చి "శబరిని తనతోపాటు తీసుకుని బాబా శిరిడీ వీధుల్లో సంచరించడం" సద్గురుదేవుని అపారకరుణకు నిజరూపం. శబరి బాబా చెంతకు చేరినా, నవ్వుతూ పలకరించే అతని రూపం, బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే అతని వ్యక్తిత్వం మనందరి మధ్య ఉంటూనే ఉంటాయి. శబరి గురించి గత రెండు సంచికలలో రావాల్సి ఉన్నప్పటికి గురుపూర్ణిమ సంచికలో శబరిని తలుచుకోవడం కేవలం సద్గురు సంకల్పమే!

**- గురుకృప**





## గురుచరణ యుగళమే రక్ష

"ధూమల్ సుమారు 1907 ప్రాంతంలో మొదటిసారి బాబాను దర్శించాడు. ఆ మొదటి దర్శనంలోనే ఆయన సాటిలేని మహాత్ముడన్న విషయం అతని హృదయంపై ముద్రించుకు పోయింది." తొలిచూపులోనే సాయికి అంకిత భక్తుడయ్యాడు ధూమల్. ప్రథమ దర్శనం అతనిలో కలిగించిన పరిణితి – అతని జీవన విధానాన్ని మార్చి వేసింది. ఈ గురుబంధువు అమ్మగారు గురువుగారి స్కూల్‌మేట్. ఎంతో ఆలస్యంగా గురుదేవుల చెంతకు చేరానని ఆమె బాధ. వారి చెంతన చేరిన క్షణం కళ్ళు చెమర్చాయి. కొత్త ఆశలు చిగురించాయి. 'నేనున్నది బాబూజీ చెంత–ఇక నాకేల చింత' అంటూ వారి అనుగ్రహపు ఆనవాళ్లతో ఆనందంగా జీవిస్తోంది. ఈ మధ్యకాలంలో మా శ్రీవారు కూడా 'బాబూజీ స్కూల్'లో చేరారంటూ చిరునవ్వుతో సమాధానం. ఇంకేం! ఇక ఈ కుటుంబానికి సద్గురు చరణ యుగళమే రక్ష!

నాకు మొట్టమొదటసారి 2004 సంవత్సరం విజయదశమి నాడు శిరిడీలో గురువుగారి దర్శనభాగ్యం లభించింది. వారిని చూడగానే ఏమైందో తెలియదు. నాకళ్ళలో నీళ్ళు, అవి కళ్ళనీళ్ళు కావు – ఆనందభాష్పాలు, బహుశా అదేకాబోలు సద్గురువు యొక్క దర్శన ప్రభావం. మహాత్ముల దర్శన భాగ్యాన్ని, వారి సన్నిధిలోని అనుభవాన్ని మరొక అంశంతో పోల్చనలవికాదు. ఇంత ఆలస్యంగా నేను గురువుగారి చెంతకి వెళ్ళానా అని బాధ ఒక ప్రక్క, గురువును ఇప్పటికైనా తెలుసుకోగలిగానని సంతోషం మరో ప్రక్కా కలిగింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో వున్న శిరీషక్క మరియు కోట విజయభాస్కర్ అంకుల్ మిషలుగా గురువుగారి గురించి తెలుసుకోగలిగాను. 20–02–2005 న తిరువణ్ణామలైలో గురువుగారి ఊదీ దర్శనం, పాద నమస్కార భాగ్యం కలిగింది. వారు చెప్పిన మాటలు నాకెంతో మనో ధైర్యాన్ని కలిగించాయి. గురుదేవుల పాదాల చెంతకు చేరగానే నా మది నెమ్మదించింది. అపుడే తెలిసింది గురు సన్నిధానం ఇంత ప్రశాంతతను చేకూరుస్తుందని!. ఇక గురుదేవుల పాదపద్మములే నాకు శాశ్వతమైన ఆనందమని, ఇంకేమీ అందుకు సాటిరాదని.

మరలా నాకు తరువాత నెలలో మార్చ్ 24వ తేదీ కూర్మన్నపాలెం ఉమా రామకృష్ణంరాజు గార్లతో కలిసి తిరువణ్ణామలైకి వెళ్ళే అవకాశం కలిగింది. ప్రతిరోజు గురువుగార్ని దర్శనం చేసుకొనుచూ, పూండీ, స్కందాశ్రమం, విరూపాక్షగుహలు, గిరిప్రదక్షిణ








చేసుకొనుచూ ఎంతో ప్రశాంతంగా గడిచిపోయింది. నాకు ప్రతినెలా నెలసరి సమయంలో చాలా ఎక్కువగా భరించలేనంత కడుపునొప్పి వస్తుంది. కానీ గురుదేవుల చెంత నాకు ఆ బాధ కొంచెం కూడా కలుగలేదు. గురువుగార్కి నేను నాకు నొప్పివస్తుంది అని చెప్పుకోనూలేదు, తగ్గించమని అడగనూలేదు, మరి అప్పటినుంచి నాకు కడుపునొప్పి రాలేదు. అప్పుడనిపించింది, గురుదేవులు నేను అడగకుండానే నా బాధని తెలుసుకొని నాకు ఆ నొప్పి నుంచి ఉపశమనం కలిగించారని, తల్లిని మించిన ప్రేమని కురిపించారని. "రహమ్ నజర్ కరో అబ్ మోరే సాయీ, తుమ్‌బిన నహీ ముఝే మా బాప్ భాయీ" అన్న దాసగణు రచించిన ఆరతి గీతార్థం నాకు అవగాహన కొచ్చింది ఈ అనుభూతి ద్వారా. అప్పుడే తిరువణ్ణామలైలో గురువుగారి సన్నిధిలో జరిగిన ఇంకో అనుభవాన్ని తోటి గురుబంధువులతో పంచుకొనుచున్నాను. ఆరోజు మార్చి 29వ తేదీన మధ్యాహ్న భోజనం చేసి నేను, ఉమ కలసి గురువుగారి ఆశ్రమం దగ్గరకు బయలుదేరాము. మధ్యలో ఒక ప్లాస్టిక్ కవర్ కాలుకు తగులుకొని పాదం మెలికతిరిగింది, చాలా నొప్పి అడుగుతీసి అడుగుపెట్టలేకున్నాను. సంవత్సరం క్రితం ఆ కాలు ఫ్రాక్చర్ అయింది. నాలుగు నెలలు బెడ్‌రెస్ట్‌లో వున్నాను. ప్రక్కనే వున్న ఉమని సపోర్ట్‌కి పట్టుకున్నాను. ఉమ నా పరిస్థితి చూచి ఆటో పిలిచింది. అందులో మెల్లగా కూర్చోని గురువుగారి ఆశ్రమానికి వెళ్ళాము. అప్పుడు నరేంద్రన్న వచ్చారు. నా పరిస్థితిని వివరించాను. ఆ పాదం దగ్గర చూశారు, బాగా వాచిపోయింది. నరేంద్రన్న చూచి "గురువుగారున్నారు కదా అంతా తగ్గిపోతుంది, విశ్రాంతి తీసుకోమ్మా" అన్నారు. సాయంత్రం 6గంటలకు సత్సంగం మొదలైంది. కానీ నేను నొప్పితో కూర్చోలేకున్నాను. జ్వరంగా వుంది. కాలు కదపలేని నొప్పి, గురువుగారూ మీరున్నారన్న ధైర్యంతో నేను ఒక్కదాన్నే వచ్చాను. కానీ ఇప్పుడు నా పరిస్థితి వలన చాలా భయంగావుంది. నేను అస్సలు అడుగుతీసి అడుగుపెట్టలేకున్నాను. సత్సంగం అయిపోయి అందరూ గురువుగారి దర్శనానికి ఆత్రుతగా మెట్లదగ్గర ఎదురుచూస్తున్నారు. నేను పైకి ఎక్కగలనా? గురువుగారి దర్శనం చేసుకోగలనా? అని అనుకున్నాను. కానీ ఎలాగో అందరూ వెళ్ళాక చివరిగా నెమ్మదిగా నడిచాను. నడవలేను అనుకున్న నన్ను గురువుగారే చెయ్యి పట్టుకొని నడిపించారేమో అనిపించింది. గురువుగారు వచ్చి ధ్యానంలో కూర్చున్నారు. అప్పుడు నా మనస్సులో వున్న బాధను గురుదేవులకు చెప్పుకున్నాను. అంతలో ఐదునిమిషాలు గడిచాయి. గురువుగారు వెళ్ళిపోయారు. ఆ తరువాత నేను మామూలుగానే దిగాను కొంచెం కూడా నొప్పి లేదు, ఆ





వాచినదంతా తగ్గింది అలాగే నడుచుకుంటూ తిరిగి రూమ్‌కి వెళ్ళాను. నాకు ఎంతో ఆశ్చర్యం, గురువుగారు నా బాధ ఆలకించారు నా నొప్పి తగ్గించారని ఎంతో సంతోషం కలిగింది. అంతా మీరే చూసుకోవాలి తండ్రీ అని వేడుకున్నందుకు నాకు ఏ కష్టం లేకుండా క్షేమంగా నన్ను వైజాగ్ చేర్చారు.

'ఏమి భయపడకమ్మా అంతా నేను చూచుకుంటాను' అని గురువుగారు అభయమిచ్చారు. వారి పాదనమస్కారంతో చెప్పలేని ఆనందం కలిగింది. ఆ పాదపద్మాలు నా మనస్సులో ప్రతిష్టించుకున్నాను. ఎప్పుడు సమయం లభించినా గురువుగారి చెంతకు వెళ్ళి వారి సన్నిధిలో గడపాలనిపిస్తుంది. గురువుగారు నన్ను అనుక్షణం చేయి పట్టుకొని నడిపించాలని, నేనెప్పుడూ వారి ఊసులో, ధ్యాసలో, ధ్యానంలో గడపాలని ఎప్పటికీ కోరుకొనుచు వారికి పాదనమస్కారము చేయుచున్నాను. అసమానమైన ప్రేమతో కోరి తన బిడ్డలను తన ఒడి చేర్చుకుంటున్న గురుదేవుల పాద పద్మముల చెంత – శాశ్వతానందం.

– **సుస్మిత**, వైజాగ్

**ఒక శిష్యుడు అదే పనిగా అందరిమీదా ఫిర్యాదులు చేస్తూ అశాంతితో అట్టుడికి పోతున్నాడు. గురువు అతన్ని పిలిచి, నీకు శాంతి కావాలా? అయితే మనుషులు మారడం లేదన్న ఫిర్యాదులు మానుకో, నీ ఆలోచనలను మార్చుకో.**

**పాదాలకు మట్టి అంటకుండా వుండేందుకు దారిపొడుగునా తివాచీలు పరిచేకన్నా, ఓ జత చెప్పులు ధరిస్తే సరిపోతుంది కదా! అన్నారు గురువు.**

**గురువు మాట యెడల చిత్తాన్ని ఏకాగ్రం చెయ్యి. వాటిని నిరంతరం మననం చెయ్యి. ఆ మాటలు నిన్ను ఉద్ధరిస్తాయని సదా స్మరిస్తూ వుండు. గురువు చెప్పినవే పుస్తకాల్లో, పురాణాల్లో వుంటాయి. గురువచనాలకవి వివరణలు మాత్రమే. మనకు గురూపదేశమే వేదవాక్కు.**

**–సత్సంగ సుమాలు**








## అనుగ్రహ స్పందన

సద్గురురాయా! మీరందించిన ఈ తనువు, మనస్సు ఒక్క విషయమై తన్మయమవుతున్నాయి – మీ చెంతన చేరామన్న సంతత ధారలో! మము పాలించే ప్రభువులు ఇన్ని సంవత్సరాలు తర్వాత చేపట్టారు బాటలను (రహదారులను) బాగుచేసే పని. అయితే జగన్నాటకమాడ మీరొచ్చే ప్రతీసారి ఈ పాత్రలనన్నింటిని తోడ్కొని వచ్చి పాత్రతలను కల్పించి, ఆనందమయ జీవనానికి వెలుగుబాటను వేసిన మహితమూర్తీ! సత్సంగ ప్రదాత! సాయిపథ అనువర్తకా! మీ చెంత చేరిన బిడ్డలందరం మీ చరణ కమలములకు నమస్సులర్పిస్తున్నాము. పశ్చిమాన సాయి ప్రణవాన్ని పూరించి, అసలైన సాయితత్త్వాన్ని మానవాళికి అందించి, మతం పేరిట చలామణి అవుతున్న మౌఢ్యాన్ని నిరసించి, సరియైన ధర్మాచరణను ప్రవర్తిల్ల చేసిన సమర్థా! మీ చరణార్చనకై ఈ గురుపున్నమిని వినియోగించ దీవించమని వేడుకుంటున్నాం.

గురుదేవా! మీ పదకమలముల చెంత చేరిన క్షణమునే, అవగతమయ్యింది – మీ పదాశ్రయమే – 'సాయి' పథమని, సద్గురు పథమని! నాడు సాయి చూపిన బాటను, సాయి చెప్పిన మాటను, భిన్నమైన సాయి సాంప్రదాయాన్ని మాకందించిన మహాత్మా మీకివే మా ప్రణామాలు. ఆధ్యాత్మికత అంటే అదేదో సముద్రమని, అందు మునకేగాని తేలిక లేదని, రాదని భావించిన మాకు 'ఆనందంగా జీవించడమే ఆధ్యాత్మికత' అని బోధించి, తప్పటడుగులు వేస్తున్న బిడ్డలను చేయిపట్టి నడిపించి గమ్యమే మీరైనా, గమనంలోనూ మా వెంట ఉంటున్న అభయప్రదాత మీకివే మా కుసుమార్చనలు.

కేవలం సంసారమే సర్వస్వమని భావిస్తున్న మావంటి వారి జీవితాలలో 'సాయిబాబా' అనే ఆధ్యాత్మిక జిజ్ఞాసను రేకెత్తించి సాయిపథమనే సత్యపథం వైపుకు నడిపించి సమర్ధ సద్గురువైన మీ చరణాలచెంత ఈ జీవులన్నింటికి చోటిచ్చిన మీ కరుణకు సహస్రకోటి వందనములు అర్పిస్తున్నాము. 'సౌఖ్యం చిక్కాక నా బిడ్డలు నన్ను ఆశ్రయిస్తారన్న' సాయి మాటను మీబాటగా, మమ్మును అక్కున చేర్చుకొని అవసరమైన క్షణాన అన్నీ ఇస్తున్న శ్రేయోదాయి మీకివే మా సాష్టాంగ ప్రణామములు. మీచెంత చేరి సాయిని కొలిస్తే, సాయి నేడు చింతలన్నీ దీర్చి, "ఎందుకొచ్చావురా ఇక్కడకు, పిడకలేరుకోవడానికా? సద్గురువును తెలుసుకో" అంటూ కనువిప్పు కల్గించారు. మీ అనుగ్రహామృతం ఆస్వాదించాక ఆలోచిస్తే అవగతమయ్యింది 'గురుకృప ఎప్పుడూ ధారాపాతంగా వర్షిస్తూనే ఉందని! "సద్గురూ! మా ఈ వినతిని ఆలకించు – మీ అనుగ్రహమే





అంతటా ఉందని, మా జీవితంలో వ్యర్థమంటూ ఏదీ లేదని, జరిగే ప్రతి సంఘటన మీ లీలా ప్రబోధమే నన్న ఎరుకను మాకు కల్గించు".

మీరందించిన ప్రతీ వనరును సద్వినియోగపరుచుకొనేట్లు దీవించండి! మా ప్రతీ అడుగు మీ వైపుగా సాగేట్లు మమ్ము ఆశీర్వదించండి. మా ప్రతీ మాట, పాట, బాట, మీ పట్ల ప్రేమను మరింతగా పెంచుకొనేట్లు, అందరితో పంచుకునేట్లు మమ్ము అనుగ్రహించండి. మీ ప్రత్యక్ష సన్నిధానాన్ని మాకు ప్రసాదించగల సత్సంగం పట్ల మా జిజ్ఞాసను మరింత ఇనుమడింప చేయండి. గుండెలోతుల నుండి సద్గురువును మనసారా పిలుచుకొనే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి! ఏ కోవ చూసినా, ఏ దోవ చేరినా, ఏ చరిత్ర చదివినా, ఏ సన్నిధినయినా మీ దర్శన భాగ్యము కల్గించవేడుకుంటున్నాము.

మన పేర్లన్నీ వ్యవహార నామాలు. అయితే ఆసద్గురు దేవుని నామం గౌణనామం అంటే వారి గుణ, మహిమ, తత్త్వ వైభవాలను ద్యోతకం చేసేది ఆ నామం. అందుకే సద్గురు నామోచ్చారణ మంత్రజపం! ఆ రూప చింతనే అద్భుత ధ్యానం. సద్గురు దేవా! చరిత్ర చెపుతోంది సద్గురు నామమహిమను, అయినా ఈ చిన్ని బుర్ర నామమహిమ యొక్క ఆంతర్యాన్ని అవగతం చేసుకోలేకపోతోంది. కరుణార్ద్ర దృక్కులతో మత అర్థాన్నే బోధించగల మీ వీక్షణాన్ని ఒకమారు మాపై ప్రసరించమని వేడుకుంటున్నాము. సద్గురు నామ వైభవాన్ని మాకవగతపరచమని ప్రార్థిస్తున్నాము.

ప్రభూ! మీరందించిన ఈ తనువును, మనసును మీ గుణకీర్తనాదులకై వినియోగించ తహతహలాడుచున్నాము. అసమగ్రమైన మా ఆలోచనలకు సమగ్రరూపమిచ్చి, అస్తవ్యస్తంగా ఉన్న మా మనసనే తంత్రిని 'శృతి' చేసి మీ చరణ కృతులుగా చేసుకొమ్మని వేడుకుంటున్నాము. గురుబంధువులారా! పదండి పోదాం శిరిడీకి, నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి ఆలస్యంగా చేరినా, సద్గురు అనుగ్రహ పవనాలు మే చివరి వారంలోనే వచ్చి చిరుజల్లులు కురిపించి అలా వెళ్ళాయి. పదండి పోదాం, క్షణం కూడా జాగు చేయవద్దు, సద్గురు అనుగ్రహధారలలో తడిసి ముద్ద అవుదాం లేదా కనీసం చల్లని సద్గురు అనుగ్రహ చిరుగాలిని ఆస్వాదిద్దాం.

**కోరినా మిగిలిన కోరికేమి - మిమ్ము కొనియాడు కృతుల పెన్నిధి తప్ప,**
**చేరినా ఇక చేరు వున్నదేమి - మీ శ్రీ చరణ దివ్య సన్నిధి తప్ప.**

**- గురుకృప**





దైవమే దిగివచ్చే దివినుంచి భువికి !
దండుగా వెళదాము ! దివిటీలు పడుదాము !